రోజూ కన్న ఓ గంట ముందుగానే, రాజారావు హుషారుగా ఇంట్లో అడుగుపెట్టాడు. అతను ఊహించినట్లుగా కాక పరిస్థితి మరో విధంగా ఎదురయ్యింది.

అతని కనుబొమలు ముడిపడ్డాయి. 'ఇదా నువ్వు చేసే పని' అన్నట్లు ఆమెను మింగేసేలా చూస్తూ నిలబడ్డాడు.

శ్రీలక్ష్మి అతన్ని చూడనేలేదు. ఆమె ధోరణిలో ఆమె వుంది. కోపాన్ని నిగ్రహించుకోవటానికి ప్రయత్నిస్తూ, ఎదురుగా నిలబడి వున్న బాబుని మరోసారి రెట్టించి అడిగింది.

"మళ్ళీ ఇలాంటి పని చేస్తావా?"

"..................."

"చెప్పు! చేస్తావా?" ఆమె చేయి వున్నట్లుండి పైకి లేచింది.

తల వంచుకునే, బాబు మొండిగా సమాధానం ఇచ్చాడు.

"తేత్తాను."

అంతే!

శ్రీలక్ష్మి చేయి ఒకే ఒకసారి బాబు చెంపని కందిపోయేలా తాకింది.

ఓ క్షణం నివ్వెరపోయి, బాబు అరున్నొక్క రాగం అందుకున్నాడు. అప్పటికే పాప ఏడుపుతో ఇల్లు అదిరిపోతోంది.

రాజారావుకి కోపంతో మతిపోయింది.

అతన్ని చూసిన బాబు బిగ్గరగా ఏడుస్తూ, అరచేతుల్తో కళ్ల నులుముకుంటూ దగ్గరగా వచ్చాడు.


హృదయం భగ్గుమన్నట్లయింది రాజారావుకి.

"శ్రీలక్ష్మీ!" అది పిలుపు కాదు గర్జన.

గోడ పక్కనే వున్న పాపను వంగి చేతుల్లోకి తీసుకుంటున్న శ్రీలక్ష్మి తలెత్తి చూసింది.

"పడుతుందేమోనని క్రింద పడుకోబెడితే వీడు పాపని...." ఆమె ఇంకా ఏదో చెప్పబోతూ వుంది. అతను వినిపించుకోలేదు. ఒక్క అంగలో ఆమెను చేరుకున్నాడు. అతని ఎడం చెయ్యి, పొడవైన ఆమె జుట్టుని గట్టిగా వెనక్కు వంచి పట్టుకుంది. కుడి చేయి రెండు చెంపలనీ రెండేసి సార్లు బలంగా తాకింది.

దిగ్భ్రమతో కళ్ళప్పగించి చూస్తూ, ఆ దెబ్బలు పాపకు తగలకుండా జాగ్రత్తపడటం మినహా, ఆమె మరేం చెయ్యలేకపోయింది.





# నేను అడ్డదాన్ని

యం. శారదా చౌదరి

"నిన్ను....నిన్ను...." మాటలు రానట్లుగా ఓ క్షణం ఆగాడు.

"ఛీ! నీలాంటి వాళ్ళను నరికి పోగులు పెట్టినా పాపం లేదు" మరోసారి ఆమె జడ పట్టుకుని అటూ, ఇటూ గుంజి వదిలేశాడు.

శ్రీలక్ష్మి నోరు పెగుల్చుకుంది.

"అంత పాపం నేనేం చేశాను? ఏం తప్పు చేశానని కొట్టారు?"

"నీ మొహం చూస్తేనే పాపం! ఇంకా సమాధానం కూడా చెప్పాలా...." రాజారావు ఛీత్కారంచేసి గదిలోకి వెళ్ళిపోయాడు.

వెళ్ళబోయే ముందు ఓ క్షణం ఆగి, ప్రపంచంలోని అసహ్యాన్నంతా తన గొంతులో ప్రతిధ్వనింపజేస్తూ, కరకుగా అన్నాడు. "ఎవరి మూలంగాఅయితే నువ్వు ఈ యింట్లో కాలుపెట్టే అదృష్టానికి నోచుకున్నావో, వాడిని కొట్టే హక్కుగానీ, కనీసం ఒక్కమాట అనే హక్కుగానీ నీకు లేదు. కేవలం వాడి దయా, దాక్షిణ్యాల మీద బ్రతకాల్సినదానివి....వాడికి ఆయావి. వాళ్ళ నాన్నకి దాసీవి....అర్థం అయిందా? ఒళ్లు దగ్గర పెట్టుకొని మసలుకో" చరచరా అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

ముందు ఆశ్చర్యంతో అర్థం కానట్లు, విస్మయంగా చూసిన శ్రీలక్ష్మి కళ్ళలో—బాధ, దుఃఖం, కోపం, కసీ, నిస్సహాయతలతోపాటు ఒక రకమైన విరక్తి భావం కదలాడాయి.

పాప, బాబూ ఇంకా వెక్కిళ్ళు పెట్టి ఏడుస్తూనే వున్నారు. పాపను ఒళ్ళోకి తీసుకుని, వంటింట్లో గోడ పక్కన చతికిలపడింది శ్రీలక్ష్మి. జీవితంలో కొత్తగా అడుగుపెట్టి, రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్న ఆమె మనసు పైకి ఏడవలేక, ఏడవకుండా వుండనూలేక, లోలోపలే ఏడుపును దాచుకుంటూ వుంది.

ఆ రాత్రి—"భోజనం వడ్డించాను" అంది గది గుమ్మం దగ్గర నిలబడి ఏ గోడకో చెప్పినట్లుగా.

మంచంమీద కూర్చుని సిగరెట్ వెలిగించుకుంటున్న రాజారావు మాట్లాడలేదు—లేచి రానూ లేదు. అలాగే కూర్చున్నాడు. లోలోపలే, 'దీనికింత పొగరా! భోజనం చేద్దురురండీ అని పిలవ కూడదూ' అనుకుంటూ.

శ్రీలక్ష్మి వంటగదిలోకి వచ్చేసి, గుమ్మానికి ఆనుకుని నిలబడి పోయింది. చాలా సేపటి తరువాత అతను బాబును ఎత్తుకుని లోపలికి వచ్చాడు.

అన్నం కలిపి పెట్టబోతూంటే వాడు మారాం సాగించాడు.

"అమ్మ కావాలి!....అమ్మా....నాకు నువ్వు అన్నం పెత్తు! నాన్నొద్దు"

రాజారావు గద్దించాడు.. "నోర్మూసుకుని తినాలోయ్!" అంటూ.

బాబు భయం, భయంగా చూస్తూ, "అమ్మా! నువ్వే పెత్తూ" అని రాగంతీశాడు.

శ్రీలక్ష్మి ముందుకువచ్చి బాబును ఎత్తుకోబోయింది.

"వీడు 'అడ్డు' అయ్యాడు అనుకుంటున్నదానివి, ఇంత విషం ఇచ్చి అయినా తొలగించగలవు."

రాజారావు తీక్షణంగా, నిశితంగా గుచ్చి గుచ్చి చూశాడు.

శ్రీలక్ష్మి చేతులు వెనక్కు తగ్గాయి. తిరిగివచ్చి యథా స్థానంలో నిలబడి పోయింది.

కొలనులో రాయివేస్తే అలలు రేగినట్లు, ఓక్షణం ఆమె హృదయం బాధతో విలవిలలాడినా క్రమంగా నిశ్చలత్వం చోటు చేసుకుంది.

*

శ్రీలక్ష్మి కన్నెత్తయినా భర్తవేపు చూడటం లేదు. మూగదానిలా అతి మామూలుగా తన పనులు చూసుకుంటూ వుంది. బాబుకి స్నానం చేయించి డ్రస్‌చేసి, ఆటలకి సిద్ధం చేసిన తర్వాతే పాప సంగతి చూస్తుంది. ఈ మధ్యలో పాప ఆకలేసి ఎంతగా ఏడ్చినా పట్టించుకోదు.

పనంతా అయిపోయినతర్వాత, పాపను చాటుకి తీసుకెళ్ళి, ఒళ్ళో పడుకోబెట్టుకుని ప్రేమగా తల నిమురుతూ కళ్ళొత్తుకోవడం బాబు ఎన్నోసార్లు చూశాడు. వాడి చిన్నారి హృదయం అమ్మ ఏడుస్తున్నప్పుడల్లా విలవిలలాడిపోతుంది. ఆమెతోబాటు తనూ ఏడుస్తాడు.

ఆ రోజు........

రాజారావుకు ఆఫీస్ టైం అయింది.

పాపను ఎత్తుకునే ఎప్పటిలాగా భోజనం వడ్డించింది శ్రీలక్ష్మి.

నెలరోజుల తర్వాత అప్రయత్నంగానే మొదటిసారిగా ఆమెవైపు చూసిన రాజారావు క్షణం అప్రతిభుడయ్యేడు.

కళకళలాడుతూండే ఆమె మొహం కళావిహీనంగా, విషాదం అంతా గూడుకట్టుకున్నట్లుగా వుంది.

రాజారావు నిర్లక్ష్యంగా మొహం తిప్పుకున్నాడు. అతనికి కసీ, కోపం ఇంకా తగ్గలేదు.

శ్రీలక్ష్మి—జరిగిపోయినదానికి క్షమించమంటూ కాళ్ళావేళ్ళాపడి ప్రాధేయపడుతుందనీ, ఎప్పటిలా మామూలుగా తన దగ్గరకు వస్తుందనీ అనుకుంటున్న అతని వూహ తలకిందులు కావడంతో కోపం ఇంకా పెరిగింది.

"అప్టరాల్ .... అడదానికింత పొగరా? చచ్చినట్లు ఇంట్లో పడుండవలసిన దానికింత అహంకారమా?" అని లోలోపలే అనుకోసాగాడు.

భోజనం చేసి, బాబునోసారి ఎత్తుకుని ముద్దులు కురిపించి వెళ్ళిపోయాడు.

తను ముద్దు పెట్టుకునేటప్పుడు బాబు చిరాగ్గా మొహం తిప్పుకోవడం అతను గమనించక పోలేదు. మధ్యాహ్నం వరకూ ఆ జ్ఞాపకం అతని మనస్సులో ములుకులా గుచ్చుకుంటూనే వుంది. ఇకవుండలేక మధ్యాహ్నం లీవ్ పెట్టేసి ఇంటికి వచ్చాడు. సినిమాకు తీసుకెళ్ళి, బాబుని సంతోష పెట్టాలని మధ్యదారిలో నిశ్చయించుకున్నాడు కూడా.

ఇంటిని సమీపించేసరికి శ్రీలక్ష్మి నవ్వు కిలకిలారావంలాగా వినిపిస్తోంది. బాబు కేరింతలు కొడుతూ ఇల్లు అదరగొట్టేస్తున్నాడు.

రాజారావు అనుమానంగా గుమ్మం పక్కనే ఆగిపోయాడు. హాల్లో, శ్రీలక్ష్మి పాపను ఒళ్ళో కూర్చోబెట్టుకుని బంతిని దూరంగా విసిరివేస్తోంది. బాబు పరుగెత్తుకుంటూ వెళ్ళి తెస్తున్నాడు. చూస్తూండగానే దృశ్యం మారింది. బాబు దూరంగా వెళ్ళిపోయిన బంతిని తీసుకురాకుండా అక్కడే వదిలేసి పరుగెత్తుకుంటూ వచ్చి శ్రీలక్ష్మి వీపు మీద వాలిపోయాడు. "అయ్యో! పడిపోతావురా, నాన్నా! నా తండ్రివిగా! లేమ్మా! చూడు పాపాయికి వూపిరాడటం లేదు." వీపు మీదున్న బాబును దించలేక, పాపను పక్కకు తీసి కింద పడుకోబెట్టలేక సతమతమయింది శ్రీలక్ష్మి.

బాబు మాత్రం ఆమె వీపును వదల్లేదు. కిలకిలా నవ్వుతూ ఆమె మెడ చుట్టూ చేతులు పెనవేసి రెండు బుగ్గలమీదా ముద్దు పెట్టుకున్నాడు.

"కాకమ్మ లేస్తూందో .... పిచ్చికమ్మ లేస్తుందో....మా బాబు లేస్తాడో?....మా బంగారు తండ్రి! పాపాయిమీద పడకుండా లేస్తాడమ్మా!"

"చూశావా?....చూశావా? మా బాబు లేచాడు!" అనగానే వీపు మీద నుంచి లేచి వచ్చి, 'నేను బంగారు తండ్రిని' అన్నట్లు గర్వంగా, ఠీవిగా నిలబడిన బాబు బుగ్గల్ని సుతారంగా చిదిమి ముద్దు పెట్టుకుంది.

"అమ్మా! అన్నం తినవూ?" బాబు అడిగాడు.

"తిన్నానుగా!"

"ఎప్పుడూ? నువ్వు తినలేదు."

శ్రీలక్ష్మి సమాధానం చెప్పలేనట్లుగా మౌనంగా పాప తల నిమురుతూ కూర్చుంది.

"అమ్మా! అన్నం తినవే........"

"...................."

"నాన్న లాచ్చుని .... అమ్మ మంచి....నాన్న అందరినీ కొలతాలు."

"...................."

"అమ్మా! నేనేమొ ఇంత పెద్దయ్యి నాన్నను కొలతాగా! ఏలవకమ్మా."

శ్రీలక్ష్మి దుఃఖం ఆపుకోలేక పోయింది. రెండో చేత్తో బాబును దగ్గరకు తీసుకుని, పాపతో పాటు గుండెలకు హత్తుకుంది.

"అమ్మా! నాకూ ఆకలేత్తూంది. అన్నం తిందాంలా!" బాబు తన గొడవ పెంచేడు

శ్రీలక్ష్మి లేచి పాపను వుయ్యాల్లో వేసి జోకొట్టింది

వంగి బాబునెత్తుకుంటూంటే, తల వంచుకొని రాజారావు గదిలోకి వెళ్ళిపోయాడు.

గాభరాగా బాబును వదిలేసి వంటిల్లోకి వెళ్ళిపోయింది.

సమయంకాని సమయంలో అతనెందుకు వచ్చిందీ ఆమెకర్థం కాలేదు.

'తను లేనప్పుడు బాబుని కొడుతున్నదేమో నన్న భ్రమతో పరీక్ష చేయటానికి రాలేదు కదా?' ఆమె మొహం మ్లానమయింది.

"అడ్డు అనుకుంటున్న వాణ్ణి, ఇంత విషం ఇచ్చి అయినాసరే తొలగించగలవు" రాజారావు అలా అన్నప్పటి నుండీ ఆమె బాబును దగ్గరకు తీయటం లేదు. అయాలాగా అన్ని పనులూ చేస్తూంది, అంతే!

కానీ రాజారావు ఆఫీసుకి వెళ్ళిపోగానే తల్లిని ఏడిపిస్తూ ఆటలాడడం మొదలెడతాడు బాబు.

"అమ్మతో మాట్లాడ వద్దు" అని తండ్రి తననెందుకు శాసించాడో ఆ పసివాడికి అర్థం కాలేదు.

ఎదిరించే వయసూ, ధైర్యమూ లేవు కనుక చాటుమాటు వ్యవహారం సాగించాడు.

అమ్మ మాట్లాడకపోతే వాడికి క్షణం తోచదు. నాన్నను చూస్తే మాత్రం భయపడాలి అని తెలుసు. రాజారావు బట్టలు మార్చుకుని మంచం మీద వాలిపోతూ, "బాబు!....ఒరేయ్ బాబిగా.... విన్నే" అంటూ పెద్దగా పిలిచాడు.

అసలే భయపడుతున్న బాబు బితుకు, బితుకు మనుకుంటూ ఒక్కొక్క అడుగే మెల్లగా వేసుకుంటూ లోపలికి వచ్చాడు.

"ఇలారా!" వాణ్ణి దగ్గరకు తీసుకుని మృదువుగా అనునయిస్తూ అడిగాడు. ఆతృతతో అతని గొంతు తడారిపోతూ వుంది.

"ఏరా కన్నా!. నీ కెవరు మంచి? అమ్మ మంచా? నాన్న మంచా?"

బాబు సమాధానం చెప్పలేదు. తల వంచుకుని షర్టు గుండీని పీక్కుంటూ అలాగే నిలబడ్డాడు.

"చెప్పమ్మా! నిన్నేం అననుగా....కొట్టను.... సాయంత్రం బోల్డన్ని చాక్లెట్లు తెస్తాను. బొమ్మలు

కొంటాను....చెప్పు! అమ్మ మంచా? నాన్న మంచా?"

"అమ్మ" అన్నాడు వాడు అమాయకంగా చూస్తూ.

రాజారావు అప్రతిభుడయ్యేడు – తను వింటున్నది, నిజమా? కాదా! అన్న అనుమానం వచ్చిందతనికి.

"అమ్మ నిన్ను కొడుతుంది కదరా! నేను నీకు చాక్లెట్లు కొంటాను. బొమ్మలు కొంటాను.... సినిమాకి తీసుకెళ్తాను."

బాబు మాట్లాడలేదు.

"అమ్మ నిన్ను కొడుతుందిగా! రాక్షసి కదూ!" రాజారావు రెట్టించాడు.

"అమ్మ నన్నేం కొత్తదు. నువ్వే అందర్నీ కొలరావు. అమ్మనీ, నన్నూ, చెల్లాయినీ... అందర్నీ నువ్వే కొలతావు" బాబు రోషంగా చూశాడు.

"నువ్వే రాక్షసుడివి!" అన్నట్లుగా వున్నాయి బాబు చూపులు.

"శ్రీ లక్ష్మి ఇంత అభిమానం ఎలా సంపాదించుకున్నది," రాజారావుకి అర్థం కాలేదు.

"నేను మంచి కదూ!" ఆశ చావక మళ్ళా అడిగాడు.

బాబు గట్టిగా, గబా గబా తల అడ్డంగా వూగించాడు.

"కాదు! అమ్మ మంచి" పళ్ళు బిగిస్తూ అన్నాడు.

రాజారావు మనసు ఆర్ద్రమయింది. కొడుకు మొహంలో మొహంపెట్టి రహస్యం అన్నట్లుగా మళ్ళీ అడిగాడు.

"అమ్మ రోజూ అన్నం తింటుందా?"

బాబు లేదన్నట్లుగా తలతిప్పాడు.

"తినమని గొడవపెట్టు.... వెళ్ళు."

బతికానురా భగవంతుడా అన్నట్లుగా బాబు వెళ్ళిపోయాడు.

రాజారావు లేచివెళ్ళి వుయ్యాల్లో వున్న పాపను తీసుకొచ్చి పక్కనే పడుకోబెట్టుకున్నాడు.

ఓ గంట క్రితం వరకూ, "ఇదో రాక్షసి. దీనిమూలంగానే కదూ శ్రీలక్ష్మి బాబుకి అన్యాయం చేస్తూంది!" అనుకున్నాడు. పాప కూడా తన ప్రతిరూపమే అని మరచిపోయాడు. ఎంత అవివేకం!




రాజారావు నిద్రపోతున్న పాపబుగ్గలు నిమిరి మృదువుగా ముద్దు పెట్టుకున్నాడు. శ్రీలక్ష్మి ఏమంటున్నదోనని వంటింటి వేపు ఓ చెవి వేసే వుంచాడు కానీ ఆతనికేవిశమయిన శబ్దమూ వినిపించలేదు.

*

శ్రీలక్ష్మి వంటిల్లు సర్దుకుంటూంటే, రాజారావు బాబునీ, పాపనీ నిద్రపుచ్చి ఆమె కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.

ఆమె రాలేదు.

సమయం గడిచేకొద్దీ రాజారావు సహనం అంతరించిపోసాగింది.

"శ్రీలక్ష్మీ! మంచినీళ్ళు పట్రా!" భార్యకు వినిపించేలా చెప్పాడు.

సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం, ప్రథమ కళత్రం తన గుర్తుగా బాబుని వదిలి, శాశ్వతంగా మరో లోకానికి వెళ్ళిపోయిన తర్వాత—కొద్ది రోజులకే శ్రీలక్ష్మిని వివాహం చేసుకున్నాడు రాజారావు.

అనేక కోణాల్లో పరిశీలించి బాబుపట్ల శ్రీలక్ష్మి ప్రవర్తనకు తృప్తిపడ్డాడు కానీ పాప పుట్టిన తర్వాత అంతవరకూ ఏ మూలనో దాక్కున్న అతని శంక ఎక్కువయింది.

"స్త్రీ తనకు మాతృత్వం లభించిన తర్వాత కూడా, మరోస్త్రీకి జన్మించిన పిల్లల్ని స్వంతతల్లిలాగా ఆదరించగలదా? అంతటి విశాల దృక్పథం స్త్రీలకు ఉంటుందా?" అతని ఆలోచనలు నిరాధారం అనుకోబోతున్న సమయాన కాస్త ఆధారం దొరికింది.


శ్రీలక్ష్మి బాబుని కొట్టడం కళ్ళారా చూశాడు.

ఆ కోపంతోనే శ్రీలక్ష్మిని కొట్టాడు. కానీ ఆ సంఘటనే ఇద్దరిమధ్య ఎంత దూరాన్ని సృష్టించిందో తెలుసుకోలేకపోయాడు.

వంటింట్లో చాప పరచుకుని పడుకుంటున్న శ్రీలక్ష్మికి అతని కేక వినిపించింది. ఎందుకో ఆమెకు తెలుసు. అయినా, మౌనంగా లైటు తీసేసి పడుకుండిపోయింది.

కన్నెపిల్లగా ఆమె కలలు కనకపోలేదు. కానీ నిజ పరిస్థితులెదురైనప్పుడు వివేకంతో ఆలోచించ గలిగింది.

రెండో పెళ్ళి వాడయితేనేం? 'నాకు గెజిటెడ్ ఆఫీసరే భర్తకావాలి; అతను అందంగా వుండాలి'



కుమారి ఎ. సంధ్యారెడ్డి

డాటర్ ఆఫ్ ఎ. వెంకటరెడ్డి

ఆర్.ఓ. పర్వతాపూర్-509 385 [తెలకపల్లి పోస్ట్, వయా నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్ జిల్లా.]

విద్యార్థిని. 21 సం॥ల వయసు. బి. ఎ. చివరి సంవత్సరం చదువుతున్నారు. కవిత్వం రాయాలన్న ఆసక్తి ఎక్కువ. విప్లవ కవిత్వాన్ని అభిమానిస్తారు. పత్రికలకు 'జోక్స్' పంపుతుంటారు. ఉత్తరాలు రాయడానికి ఆసక్తి చూపుతారు.

కుమారి బి. సుశీలారాణి

కేరాఫ్ బి. ఎల్. నరసింహారావుగారు

మేనేజర్ - నాజ్ థియేటర్, చీరాల.

19 సం.లు వయసు. మెట్రిక్‌దాకా చదువుకున్నారు. 'ఎప్పటికయినా మంచి గాయని అనిపించుకోవాలని నా కోరిక' అంటారు. పాటలు పాడడంలో ఉత్సాహం ఉన్నది. తోట పనిలో ఆసక్తి. తీరిక వేళల్లో నవలు చదవడం, ఆటలు ఆడడం చేస్తూ ఉంటారు.

శ్రీమతి ఎం. లక్ష్మి సత్యారావు

వైఫ్ ఆఫ్ ఎమ్. సత్యారావు [ఎస్ అండ్ ఎస్ ఇంజనీర్ బి హెచ్ ఇ ఎల్ లిమిటెడ్]

1-80/1 కూకట్‌పల్లి, హైదరాబాదు-18.

వయసు 25 సం॥లు. గృహిణి. కుట్లు, పెయింటింగ్, చిత్ర కళలలో ఆసక్తి చూపుతారు. చక్కని రచనలు చదువుతారు.

శ్రీమతి ఎన్. కల్యాణిరాజు

20-1-52 చెంగలరావు పేట, ఆసి పాప వీధి, విశాఖపట్నం-1.

గృహిణి. 25 సం॥ల వయసు. ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. సంగీతంలో ప్రవేశం వున్నది. పుస్తకాలు చదవడం, కొత్త వంటలు నేర్చుకోవడం ఇష్టం.

శ్రీమతి ఎమ్. ఎస్. వీరమతి ప్రసన్నకుమార్

డాటర్ ఆఫ్ ఎ. రంగనాథం, మైన్ ఓవర్, కడప.

గృహిణి. వయసు 19 సం.లు. పి. యు. సి.దాకా చదువుకున్నారు. క్రీడారంగంలో ఆసక్తి ఎక్కువ. చాలా ఆటల్లో ప్రవేశం వున్నది. రకరకాల పిండి వంటలు చెయ్యడం అంటే ఇష్టం. కలం స్నేహం చెయ్యడంలో ఉత్సాహం ఉన్నది.

---

అనుకుంటూ గొంతెమ్మ కోరికలతో పట్టుపట్టి కూర్చుంటే ఎలా?

ఒక బాబు వుంటేనేం? వాణ్ణి స్వంత కొడుకులాగా చూసుకోలేదూ? తన మీద తనకామాత్రం నమ్మకం లేదా? నిజంగా అదృష్టమే బావుండి వుంటే మూడు సంవత్సరాలక్రితమే ఆయన భార్య అయి, తనే బాబుకి తల్లి అయివుండేది. కానీ దేవుడు మరోలా బాబును తనకందించాడు—అనుకుంది.

అసలు బాబు తన కొడుకు కాదు అనే వూహే తనకు రాదు. తన మనసులో లేని విషయాన్ని, ఆయన ఎందుకలా వూహిస్తారు? అపోహలతో, అనుమానాలతో తనను ఎందుకిలా బాధిస్తున్నారు?

శ్రీలక్ష్మికి దుఃఖం పెల్లుబికి వచ్చింది.

"తనెంత దుర్మార్గురాలిగా చిత్రింపబడింది?" అనుకుంది—బాధగా కళ్ళొత్తుకుంటూ.

బాబుకు వాళ్ళమ్మే వున్నట్లయితే, వాడు బొమ్మతో ఆడుకుంటున్నట్లు—చెల్లెలి వేలు పుచ్చుకుని బరబరా లాక్కొస్తుంటే వూరుకుంటుందా? విపరీతమైన గారాబంతో వాడు చెడిపోతుంటే వదిలేసి, తమాషాచూస్తూ కూర్చుంటుందా? కోపం వచ్చి కొడితే, వాళ్ళనాన్న ఆమెను కొట్టేవారేనా?—ఆలోచనలలోంచి తేరుకుని వులిక్కిపడి తలెత్తి చూసింది శ్రీలక్ష్మి.

రాజారావు ఆమె పక్కనే కూర్చుని రెండు వైపులా చేతులువేసి ముందుకు వంగాడు.

కిటికీలోంచి పడుతున్న వెన్నెల వెలుగులో భర్త వైపు ఓసారి చూసి పక్కకు తిరిగి గట్టిగా కళ్ళు మూసుకుంది.

"లక్ష్మీ! నన్ను క్షమించు. క్షమిస్తావు కదూ!" రాజారావు గొంతు జీరతో వణికింది. మౌనంగా భార్యను ఒళ్ళోకి తీసుకుని చాలాసేపు తల నిమురుతూ ఉండిపోయాడు.

ఆమె తేరుకున్న తర్వాత, నెమ్మదిగా అడిగాడు

"కొట్టానుకదూ....నీకు కోపం రాలేదా లక్ష్మీ? పుట్టింటికి వెళ్ళిపోలేదేం?"

"మీ మీద కోపమా? ఎందుకూ?" అంది అతి మామూలుగా.

"అదే....ఆ రోజు కొట్టాను కదూ....కోపం రాలేదా? 'అసలు నన్ను కొట్టడానికి మీకేం హక్కుంది? పెళ్ళాం మీద చెయ్యి చేసుకునే మీరూ మనుషులేనా?' అని నువ్వు అని వుంటే పరిస్థితులింత దూరం వచ్చేవి కావుగా."

"బాగుంది—భర్త మీద కోపం వస్తే పుట్టింటికెళ్తారా! నాకు తెలీదు. పావకుపాలు పట్టలేదు....లేస్తుందేమో" మాట మారుస్తూ అతని చేతుల్ని తప్పించుకుని లేచి కూర్చుంది.

ఆ రాత్రి ఆమె గుండెల్లో తలపెట్టుకుని హాయిగా, నిశ్చింతగా నిద్రపోయాడు రాజారావు.

"నేను ఆడదాన్ని! మొగుడికి కోపం వచ్చి కొట్టినా పడుండవలసినదాన్ని. మొగుడి మీద కోపం వస్తే చచ్చినట్లు కుక్కిన పేనులాగా వుండాలి. ఒకవేళ మీ మీద కోపంతో పుట్టింటికి వెళ్ళితే (అంతకన్నా చేసేదేం లేక) మొగుణ్ణి వదిలేసిందనో, మొగుడొదిలేశాడనో చెప్పుకుంటుంది లోకం. ఆ ముద్ర నా మీదే కాదు. నా కూతురు మీద కూడా పడుతుంది. ఒకవేళ ఆ రోజు నేనే మిమ్మల్ని "నన్నెందుకు కొడతారు?" అని ఎదిరించాననుకోండి. మొగుడికి ఎదురు తిరిగే గయ్యాళి భార్యగా మీ మనసులో నాకు శాశ్వతస్థానం ఏర్పడుతుంది. తప్పు మీదేనని ఆ తరువాత మీకు తెలిసినా ఇప్పుడు నన్ను దగ్గరకు తీసుకున్నట్లు తీసుకునే వారేనా? క్షమించమని అడిగే వారు కానే కాదు. ఇద్దరి మధ్యా ఓ అఖాతం ఏర్పడిపోయేది. అది పెరిగి పెద్దదయితే 'నువ్వు నా భార్యవు కావు. అవతలికి నడు' అంటూ విడాకులిచ్చి మరో పెళ్ళి చేసుకోగలరు. కానీ....నేను ఆడదాన్ని....అలా చెయ్యలేను. కనుక మీరు తిట్టినా కొట్టినా నోర్మూసుకు పడుండాలి. అలా పడుండని రోజున సంసారం నరకం అవుతుదని నాకు తెలుసు...." శ్రీలక్ష్మి హృదయంలో చెలరేగుతున్న భావాలు అతనికేం తెలియవు. □